చేతిపంపులు నిరుపయోగం

- గ్రామాల్లో మరమ్మతుకు గురైన చేతిపంపులు
- వాటిని వినియోగంలోకి తీసుకురాని అధికారులు
- నీటి కోసం ప్రజల అగచాట్లు

బ్రహ్మసముద్రం: గ్రామాల్లో వ్యవసాయ బోరుబావులు, తాగునీటి పథకాలు లేని అందుబాటులో లేని సమయంలో చేతిపంపులు (బోరంగిలు) కొద్దోగొప్పో దాహార్తి తీర్చేవి. వాటి ద్వారా పశువులు, ప్రజల రోజువారి అవసరాలు తీరేవి. పంచాయతీ అధికారులు వాటిని మరమ్మతులు చేయించకుండా నిరుపయోగంగా ఉంచారు. దీంతో నీటి సమస్యలు అధికమయ్యాయి. వాటిని మరమ్మతు చేయిస్తే కొంత వరకైనా నీటి సమస్య తీరుతాయని ప్రజలు అంటున్నారు.

మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో ప్రజలు పంచాయతీ తాగునీటి పథకాలు, సత్యసాయి తాగునీటి పథకాలకు ప్రత్యామ్నాయంగా చేతిపంపులు (బోరంగి)తో దాహం తీర్చుకున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 168 చేతిపంపులు ఉన్నాయి. కానీ వాటిలో 100 మాత్రమే పనిచేస్తున్నాయి. చేతిపంపుల మరమ్మతు చేయించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మండలంలో ని పలు గ్రామాల్లో చేతిపంపులు మైనర్ మరమ్మతులు చేసినట్లు చెప్తున్నారుగానీ అవి పని చేయడం లేదని ప్రజలు అంటున్నారు. చాలా చోట్ల చేతిపంపుల వద్ద ఫొటోలు తీసుకొని మరమ్మతు చేసినట్లు చూపి నిధులు మింగేశారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికితోడు మరమ్మతుకు గురైన చేతిపంపుల్లోని పైపులు కొన్ని మాయం చేశారని అంటున్నారు. అదనపు పైపులు అవసరం అని చెప్పి కొత్త పైపులు కొనుగోలు చేసి వాటిని పక్కదారి పట్టించారని, కొన్నింటిని సగం రేట్లకే విక్రయించినట్లు కొందరు వాటిని మంచాలు, రేకుల షెడ్‌లకు వాడుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోలేదు.


ఎస్.కోనాపురం గ్రామంలో మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

అధికారులు పట్టించుకోలేదు..



భైరవానితిప్ప పంచాయతీలోని పోలేపల్లి గ్రామంలో దాదాపు ఐదుకు పైగా చేతిపంపులు ఉన్నాయి. అందులో నీరు పుష్కలంగా ఉంది. అయితే చేతిపంపులు మరమ్మతుకు గురయ్యాయి. నిధులు ఏమవుతున్నాయో అర్థం కావడం లేదు. కనీసం వాటిని మరమ్మతు చేయించేవారు లేరు. ఈ సమస్యపై పలు మార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం చూపుతున్నారు.
– శెట్టిగారి మంజునాథ్, సర్పంచ్, భైరవానితిప్ప పంచాయతీ

మరమ్మతు చేయిస్తాం



మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఎక్కడెక్కడ చేతి పంపులు వినియోగంలో లేవో వాటిని గుర్తిస్తాం. మరమ్మతులకు గురైన చేతిపంపుల సమాచారం సేకరించి, మెకానిక్‌ల ద్వారా మరమ్మతు చేయిస్తాం. వాటిని వాడకంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. చేతిపంపులు నిరుపయోగంగా ఉండకుండా వాడుకలోకి తెస్తాం.
– సుబ్బరాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, బ్రహ్మసముద్రం మండలం

స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకిస్తూ నిరసన


ఉరవకొండ విద్యుత్ శాఖ ఏడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు


ధర్నా అనంతరం విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందిస్తున్న వామపక్షాల నాయకులు

ఉరవకొండ: విద్యుత్ స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ ఏడీ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. సీపీఎం నాయకులు మధు, రంగారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తామని ఎన్నికల్లో చెప్పిన చంద్రబాబు.. ఏడాది కూటమి పాలనలోనే సర్దుబాటు చార్జీలను అదనంగా మోపారన్నారు. ప్రస్తుతం మరో భారం వేయడానికి సిద్ధమయ్యారన్నారు. ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగించే కార్యక్రమం ఆపకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మురళీ, వీరాంజనేయులు, రామాంజనేయులు, సిద్దప్ప, శీనప్ప పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: ఇళ్లకు విద్యుత్‌స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ కోరారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అనంతరం విద్యుత్‌శాఖ డీఈ రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ ఓబులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బీహెచ్ రాయుడు, సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేయాలి

రాయదుర్గంటౌన్: విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, పెంచిన ఇంధన సర్దుబాటు చార్జీలు ఉపసంహరించుకోవాలని వామపక్షాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ, సీపీఎం, ఏపీ రైతు సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కణేకల్లు రోడ్డులోని విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున, సీపీఐ ఇన్‌చార్జ్ నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం, స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే రద్దు చేయకపోతే ప్రజా ఉద్యోగం చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందించారు.

రైతుల గోడు పట్టని కూటమి సర్కార్


బెణికల్లులో సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకుంటున్న నాయకులు

కణేకల్లు: రైతుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని రైతులు వైఎస్సార్‌సీపీ నాయకుల దృష్టికి తెచ్చారు. వరి నాట్ల సమయంలో కనీసం యూరియా సరఫరా చేయలేదని అన్నారు. మంగళవారం మండలంలోని బెణికల్లు, ఎస్‌ఆర్‌ఎస్ క్యాంపు గ్రామాల్లో 'బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.ఉషారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఆర్కే బద్రీ, ఎంపీటీసీ శరబన్న గౌడ్, స్థానిక నాయకులు సంగప్ప, జేజేటీ ప్రభాకర్‌రెడ్డి ప్రజల ఇళ్ల వద్దకెళ్లి కూటమి పాలనపై అడిగి తెలుసుకున్నారు. యూరియా కోసం నానా అవస్థలు పడుతున్నామని రైతులు ఆవేదన చెందారు. జగనన్న పాలనలో ఆర్‌బీకే ద్వారా ఎలాంటి కొరత లేకుండా యూరియా అందేదన్నారు. సొసైటీలు (పీఏసీఎస్)లకు సరఫరా అవుతున్న యూరియాను అధికార పార్టీ నాయకులకు మాత్రమే ఇస్తున్నారన్నారు. జగనన్న పాలనలో పావలా వడ్డీకే రుణాలు ఇచ్చేవారని డ్వాక్రా మహిళలు చెప్పారు. కూటమి సర్కారు వడ్డీ లేని రుణాలిస్తామని చెప్పిందని అయితే తమకు ఇవ్వలేదన్నారు. ఇలా అనేక సమస్యలను ప్రజలు వైఎస్సార్‌సీపీ నాయకుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు హళ్లి నాగరాజు, వేమన, స్థానిక నాయకులు భీమిరెడ్డి, నాగరాజు, హనుమంతు, శివశంకర్, నాగేంద్రరెడ్డి, వన్నూరుస్వామి, కాలెప్ప, యర్రగుంట గోవర్ధన్‌రెడ్డి, వై.హనుమంతు, చిన్న సర్మస్, చిక్కణ్ణ, బాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి

బ్రహ్మసముద్రం: సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకు అని సభ్యులు అధికారులను నిలదీశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వ్యవసాయశాఖ అధికారి గోపాల్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతు సేవ కేంద్రాల్లో రైతులకు కందులు పంపిణీ చేస్తున్నామన్నారు. దీంతో బొమ్మగానిపల్లి, సర్పంచ్ ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ ఉచిత కందులు రైతులకు పంపిణీ చేయకుండా, కేవలం టీడీపీ నాయకులు సూచించిన వారికి మాత్రమే పంపిణీ చేస్తున్నారని విమర్శించారు. పశువుల బీమా వర్తించలేదని సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఉపాధి ఏపీఓ మాట్లాడుతూ ఉపాధి పథకంలో అవకతవకలకు తావు లేకుండా టెక్నాలజీతో కూలీల హాజరు చూపేలా యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. సమావేశానికి గైర్హాజరయిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ రంగనాయకులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వెంకటేష్‌నాయక్, సునందమ్మ, ఎంపీటీసీలు నాగలక్ష్మి, బుసప్ప, సువర్ణమ్మ, తిప్పేస్వామి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శెట్టిగారి మంజునాథ, సర్పంచ్ ఆదినారాయణరెడ్డి, అంజినమ్మ , డాక్టర్ రాజేష్‌కుమార్, ఎంఈఓ -2 కృష్ణానాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బరాయుడు, ఏఓ గోపాల్, ఇన్‌చార్జ్ ఏపీఎం హుసేన్, పశువైద్యాధికారి నాగబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఖాసీంబీ, రామాంజనమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి లక్ష తులసీమాల అలంకరణ


ప్రత్యేక పూజలందుకున్న నేమకల్లు ఆంజనేయస్వామి, క్యూకట్టిన భక్తులు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామిని మంగళవారం లక్ష తులసీ మాల అలంకరణ చేశారు. శ్రావణమాసం రెండో మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. కర్ణాటక ఆంధ్రా ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయం భక్తులతో పోటెత్తింది. ఎస్ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నేమకల్లు క్వారీ డెవలప్‌మెంట్ యజమాని అన్నదానం చేశారు.

'దుర్గం'లో దంచికొట్టిన వాన


ఉద్దేహాళ్ వద్ద ప్రవహిస్తున్న వేదావతి హగరి నది


రాయదుర్గం కొలిమివీధిలో నిలిచిన వర్షపునీరు

- నీటమునిగిన లోతట్టు కాలనీలు
- నియోజకవర్గంలో 152 ఎం.ఎం వర్షపాతం నమోదు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం 152 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. డి.హీరేహాళ్ మండలంలో 58.2 మిల్లీమీటర్లు, రాయదుర్గంలో 45.6 మిల్లీ మీటర్లు, కణేకల్లులో 26.2 ఎం.ఎం, బొమ్మనహాళ్‌లో 11.8 మిల్లీ మీటర్లు, గుమ్మఘట్టలో 10.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. రాయదుర్గంలో మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. పట్టణంలోని కొలిమివీధి, రామస్వామి వీధి, ఈసేవా ఏరియా, మధు టాకీస్ ఏరియా, దుగ్గిలమ్మ గుడికి వెళ్లే ప్రాంతాల్లోకి నీరు చేరింది. కొండపై నుంచి వచ్చిన వర్షపునీటితోపాటు డ్రైనేజీలు పొంగిపొర్లడంతో రోడ్లపై వర్షపునీరు భారీగా పారింది.

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా మంగళవారం తెల్లవారుజామున వర్షం దంచికొట్టింది. ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, ఉంతకల్లు, దేవగిరి, బండూరు, కొలగానహాళ్లి, కల్లుదేవనహళ్లి, ఎల్‌బీ నగర్, ఉప్పరహాళ్, కృష్ణాపురం, లింగదహాళ్, నేమకల్లు తదితర గ్రామాల్లో ఏకదాటిగా రెండుగంటలకు పైగా వర్షం కురిసింది. దీంతో 11.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి కొలగానహళ్లి వద్ద కబ్బాల్ వంక, కందేపల్లి వద్ద వేదావతి, ఉద్దేహాళ్ వద్ద వేదావతి హగరి నది వరద నీటితో ప్రవహిస్తోంది. అక్కడక్కడ వాగులు, వంకలు నీటితో మునిగిపోయాయి.


బెళుగుప్పలో కూలిపోయిన ఇంటిని చూపుతున్న సువర్ణ,మల్లేష్ దంపతులు

బెళుగుప్పలో కుండపోత వర్షం

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. గంటల తరబడి కురిసిన వర్షపాతం జిల్లాలోనే అత్యధికంగా 90.8 మిల్లీ మీటర్లుగా నమోదయినట్లు ఏఓ పృథ్వీ సాగర్ తెలిపారు. భారీ వర్షానికి మండలంలోని బెళుగుప్ప, శీర్పి గ్రామాల చెరువులకు వర్షం నీరు వచ్చి చేరింది. బెళుగుప్ప ఎస్సీ కాలనీలో సువర్ణ, మల్లేష్ దంపతులు నివాసం ఉన్న మట్టి ఇళ్లు పూర్తిగా కూలిపోయింది. ఇంట్లోని నిత్యావసరుకులు బియ్యం బస్తాలు, టీవీ, బీరువా, ఇతర సామాగ్రి కలపి రూ.80 వేల వరకు నష్టపోయామని బాధితులు తెలిపారు. దీనిపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఆముదం సాగుతో ఆర్థికంగా బలోపేతం

- వ్యవసాయ శాఖ ఏడీ అల్తాఫ్ బాషా


ఆముదం విత్తనాలను అందిస్తున్న ఏడీ అల్తాఫ్ అలీఖాన్

కూడేరు: ఆముదం పంట సాగుతో అధిక ఆదాయం పొంది, ఆర్థికంగా బలోపేతం కావొచ్చని అనంతపురం డివిజన్ ఏడీఏ అలాఫ్ అలీఖాన్ రైతులకు సూచించారు. మంగళవారం స్వశక్తి రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో కూడేరు, పి.నారాయణపురం, అరవకూరు, కలగళ్ల, కరుట్లపల్లి, ముద్దలాపురం గ్రామాల్లో రైతులకు ఉచితంగా బై బ్యాక్ అగ్రిమెంట్ ద్వారా ఆముదం విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ శుభకర్, స్వశక్తి రైతు సంఘం సీఈఓ అమర్‌నాథ్ రెడ్డి, కార్డ్ సంస్థ ప్రతినిధి నిర్మలా రెడ్డి, సిబ్బంది భాస్కర్, కుళ్లాయప్ప, రైతులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సిద్ధూ


అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య నూతన జిల్లా కమిటీ సభ్యులు

ఉరవకొండ: స్థానిక అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏఐఎఫ్‌డీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా సిద్ధూను ఎంపిక చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జిల్లా స్థాయి విద్యార్థి సమాఖ్య సమావేశంలో జిల్లా కమిటీని ఎంపిక చేశారు. సమావేశానికి శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి సాయినాథ్‌రెడ్డి అధ్యక్షత వహించగా, విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ డక్క కుమార్, సీపీ నాగేంద్రకుమార్ మాట్లాడారు. నూతన జిల్లా కమిటీ ఎంపిక : అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య నూతన జిల్లా కమిటీని 13 మందితో ఎంపిక చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీఎం సిద్ధూ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉరవకొండకు చెందిన సీఎం సిద్ధూను ఎంపిక చేశారు.

ఇక నుంచి ఆన్‌లైన్‌లోనూ కానుకల చెల్లింపులు


నేమకల్లు ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ బోర్డులు

బొమ్మనహాళ్: ఆధునిక సాంకేతికత ఆలయాలకు కూడా పాకింది. భక్తులు కానుకలు వేసేందుకు సరిపడా నగదు లేకపోయినా ఇక ఆన్‌లైన్ చెల్లింపులైన ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, తదితర క్యూఆర్ కోడ్ విధానంలోనూ చెల్లించే అవకాశం కల్పించారు. ఇందుకు క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ పద్ధతిని జిల్లాలో ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో దేవదాయశాఖ అధికారులు అనుసరిస్తున్నారు. శ్రావణమాసం సందర్భంగా ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు నగదు లేదని వెళ్లిపోకుండా, క్యూఆర్ స్కానింగ్ విధానంతో చెల్లించొచ్చని ఆలయం ఎదుట క్యూఆర్ కోడ్, బ్యాంకు వివరాలతో కూడిన సమాచారం బోర్డు రూపంలో ఏర్పాటు చేశారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిగా హారూన్ రషీద్



ఉరవకొండ: ఉరవకొండకు చెందిన హారున్ రషీద్‌ను ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఈనెల 4న శింగనమలలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాల్లో హారూన్ రషీద్‌ను జిల్లా సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఉరవకొండ పట్టణ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా ఉన్న రాజేష్‌ను జిల్లా కమిటీ సభ్యుడిగా నియమించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి హారున్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన జిల్లా కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రికి ఏసీ వితరణ


వైద్యులకు ఏసీని అందిస్తున్న ఎంసీహెచ్ రాజ్‌కుమార్

బొమ్మనహాళ్: అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంసీహెచ్ రాజ్‌కుమార్ మంగళవారం ఏసీ వితరణ చేశారు. చిన్నపిల్లల వార్డులో ఏర్పాటు చేసేందుకు రూ.40వేలు వెచ్చించి ఏసీ అందజేశారు.

పీహెచ్‌సీ ఆవరణలో చెత్తాచెదారం తొలగింపు


పీహెచ్‌సీ భవనం చుట్టూ పిచ్చి మొక్కలు, చెత్తను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: స్థానిక పీహెచ్‌సీ చుట్టూ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగింపజేశారు. గత నెల 31న 'పీహెచ్‌సీలో పాము సంచారం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైంది. స్పందించిన వైద్యాధికారిణి ఉషారాణి పీహెచ్‌సీ భవనం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగింపజేశారు. పిచ్చిమొక్కలు, చెట్ల నుంచి ఆకులు రాలి చెత్తకుప్పలుగా ఏర్పడడంతో, అందులో పాములు చేరి పీహెచ్‌సీలోకి వచ్చేవి.

'ఉపాధి' పనుల్లో రూ.2.85 లక్షల అక్రమాలు


ప్రజావేదికలో మాట్లాడుతున్న అధికారులు

గుమ్మఘట్ట: ఉపాధిహామీ పథకం పనుల్లో అక్రమాలు రూ.2.85 లక్షలు అక్రమాలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ శ్రీనివాసులు అక్రమాలను వెల్లడించారు. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి ఆఖరు వరకు ఉపాధిహామీ పథకంలో 1,747 పనులకు గాను రూ.12.69 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.4.64 కోట్లు వెచ్చించారు. ఈ పనులపై సామాజిక తనిఖీ బృందం గత నెల 27 నుంచి ఈ నెల 2 వరకు ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, క్షేత్రస్థాయిలో తనిఖీల్లోని వెలుగు చూసిన అక్రమాలను వెల్లడించారు. మొత్తం రూ.2.85 లక్షల అక్రమాలు జరిగాయని, ఉపాధి సిబ్బంది నుంచి రూ.5.41 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, ఎంపీడీఓ రామకృష్ణ, ఎస్‌టీఎం లోకేశ్వర రెడ్డి, అబుడ్స్‌మెన్ శివారెడ్డి, ఎస్‌ఆర్‌పీ నీలకంఠ, డీఆర్పీలు, ఏపీఓ సురేశ్, వెలుగు ఏపీఎం నారాయణస్వామి, ఈసీలు అంజన్‌కుమార్, రవి, టెక్నికల్ , ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే అమృతం


తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: తల్లి పాలు బిడ్డకు అమృతమని, బిడ్డ పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు తాపాలని ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాభార్గవి తెలిపారు. మంగళవారం శ్రీధరఘట్ట గ్రామంలో అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలతో కలిసి తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్లు ఇవ్వాలి


తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

రాయదుర్గంటౌన్: జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టులు మంగళవారం నిరసన తెలియజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నాగరాజు అందించారు. యూనియన్ నాయకులు అయూఫ్, కమలాక్షుడు మాట్లాడుతూ ఈసారి జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హిస్టరీ సబ్జెక్టు బోధించడానికి గెస్ట్ లెక్చరర్‌ను నియమించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు ఈనెల 7న ఉదయం 10 గంటలకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో మౌఖిక పరీక్షకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9440604244లో సంప్రదించాలన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

రాయదుర్గంటౌన్: లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ ఆర్‌ఎస్ జూలై 2025)ను యజమానులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అనధికారిక లేఅవుట్‌లో ఒక్క ప్లాట్ అయిన 2025 జూన్ 30 లోపు రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రారంభమైన తేదీ 2025 జూలై 26 నుంచి 90 రోజుల్లోపు ప్లాటు యజమానులు లేదా లేఅవుట్ యజమానులు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

లాభసాటిగా ఆయిల్ ఫామ్ సాగు


కూడేరు:మాట్లాడుతున్న ఉద్యానశాఖ నియోజకవర్గ అధికారిణి యామిని

కూడేరు: ఆయిల్ ఫామ్ సాగు లాభసాటిగా ఉంటుందని, ఈ పంట సాగుకు రైతులు ఆసక్తి చూపాలని ఉద్యాన శాఖ నియోజకవర్గ అధికారిణి యామిని సూచించారు. మంగళవారం పి.నారాయణపురంలో సాగు అయిన ఆయిల్ పామ్ పంటను ఆమె పరిశీలించారు. ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించడానికి పాటించాల్సిన జాగ్రతలపై తెలియజేశారు. ఉద్యానశాఖ అధికారిణి మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్‌ఎంఈఓ-ఓపీ ద్వారా రైతులకు ఆయిల్ పామ్ మొక్కలు ఇస్తామన్నారు. ఎకరాకు 57 మొక్కలు చొప్పున హెక్టార్‌కు 141 మొక్కలు ఇస్తూ మూడున్నర ఏళ్ల మెయింటెన్స్ బిల్లు రూ.5,250 ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంకే ఆగ్రోటెక్ కంపెనీ ప్రతినిధులు మురళీ కృష్ణ , చంద్ర, సుమంత్, రైతులు పాల్గొన్నారు.

బొలెరో బోల్తా.. నేలపాలైన టమాటాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోరంపల్లి గ్రామం వద్ద మంగళవారం టమాట లోడు (బొలెరో వాహనం) బోల్తా పడి డ్రైవర్, మరో వ్యక్తి గాయపడ్డారు. గుమ్మఘట్ట మండలం నుంచి అనంతపురంలోని టమాట మండీకి 150 బాక్స్‌లతో బొలెరో వాహనం వెళ్తుండగా, తీరా.. బోరంపల్లి వద్దకు రాగానే టైరు పగిలి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బొలెరోలోని డ్రైవర్, మరో వ్యక్తి గాయపడ్డారు. టమాటాలు నేలపాలయ్యాయి. సుమారు రూ.1.50లక్ష నష్టం వచ్చినట్లు బాధిత రైతు తెలిపారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.